# మిలియండాలరు కొచ్చెను!

- పొత్తూరి విజయలక్ష్మి

''పువ్వులమ్మిన చోట కట్టెలు అమ్మాలంటే కష్టం కాదుటండీ మరి'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

'' ఏడిసినట్టుంది నివ్వు సెప్పేది. కట్టెలు కాదుకదా అమ్ముదామంటే సితుకు పుల్లలు గూడా లేనట్టు అయిపోయింది కదయ్యా!'' వాపోయాడు సుబ్బయ్య.



ఏవిటో అప్పటి రోజులు జూసి ఇట్టాంటి రోజులు చూస్తా వుంటే బాధగా వుంది అన్నాడు సూర్యం.

''ఇప్పుడందరి ఏడుపూ ఏమిటో? సినిమాల్లో కథాబలం లేదు అనేకదా. ఆ మాటకొస్తే ఆనాడు మాత్రం ఏం కథలు వున్నాయి?

హీరో హీరోయినూ ప్రేమించుకోవడం. హీరోకి క్షయవ్యాధి వచ్చి వుదారంగా ఆహీరోయిన్ని తనస్నేహితుడికిచ్చి పెళ్లి చెయ్యడం, హీరో ఆస్పత్రికెళ్ళి బాగయిపోవడం. ఈలోగా ఆ స్నేహితుడు కాస్తా ఏ ప్రమాదంలోనో బక్కెటు తన్నెయ్యడం ఇహ తర్వాత ఏడుపులూ ఓదార్పులూ, ఆఖరికి శుభం. ఇదా కథ.

ఉమ్మడి కుటుంబం. సీతమ్మవారి లాటి పెద్దకోడలు.రావణాసురుడిలాటి పెద్దకొడుకు. నోట్లో నాలికలేని మావ. గయ్యాళి అత్త. ఇంట్లోపడున్న ఆడపడుసు, ఏబ్రాసి అల్లుడు. రాములవారి లాటి చిన్నకొడుకు. ఇదాకథ.

ఇక మిగిలినవన్నీ పౌరాణికాలు, జానపదాలు అంతేగా'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''అట్టనమాకు. అప్పట్లో ఓ హీరోనెట్టి సినిమా తీస్తే వందరోజులు గ్యారంటీ. ఇప్పుడు ఎలుగేది?'' అన్నాడు సూర్యం.




* * *

పెళ్లయిన అందమైన స్టార్స్‌కి రెండు రకాల కష్టాలు. అందాలు దాచుకోవాలంటే దాచుకోబుద్ధి కాదు. ఎక్స్‌పోజ్ చేద్దామంటే సిన్మాఛాన్సులుండవు. మరెలా? ఒకటే మార్గం. ఏదైనా హై ఫై పార్టీలు వుంటే ఇదిగో ఇలా ఒక సంచలనం సృష్టించవచ్చు అని నిరూపించింది శ్రీదేవి. ఎప్పుడూ లేనిది శ్రీదేవి- లోఫైన నెక్‌లైన్ డ్రెస్ ధరించి లోఫైన క్లీవెజ్ చూపించి అందరిమతులను పోగొట్టింది. అందరూ లోతుగా చూసి విస్తుపోయిన వారే. భర్త బోనీ కపూర్‌తో సహా. అయినా శ్రీదేవి బుగ్గల్లో సిగ్గులేం కన్పించలేదు. బహుశా.. బోనీకపూర్ సిగ్గుపడి వుండొచ్చు అని అనుకుంటున్నారు బాలీవుడ్ జనం.

* * *

శానా ఆరిబుల్‌గా వుంది చిచ్యుయేషను. కోట్లు కోట్లు కర్సేతప్ప రాబడే లేకుండా వుండాది'' అక్రోసించాడు సుబ్బయ్య.

''మరీ బొత్తిగా అలాగా లేదు. కథా కాకరకాయా లేకుండా ఊరూపేరూ లేని కొత్తవాళ్ళతో సినిమా తీసేసి కోట్లు గడించేస్తున్నారు కొంతమంది. అంతా అయోమయంగా అర్థాంతరన్యాసం'' అన్నాడు సుబ్రమణ్యం.

''అదే నేనూ సెప్పేది. ఏది తీత్తే జనం చూత్తారో ఏది తీత్తే చూడ్రో అంతుబట్టి చావడం లేదు. అప్పటికీ జాతకాలు చూపిస్తన్నాం, ప్రశ్నలు చెప్పింతన్నాం. ఆ జాతకాల వాళ్ళూ ప్రశ్నలవాళ్ళూ బాగుపడతన్నారుగానీ మనం ఇట్టానే వున్నాం'' అన్నాడు సూర్యం.

'' ఇవన్నీ ఇట్లా వుంచితే ఖర్చు బాగా పెరిగిపోయింది. ముట్టుకుంటే చెయ్యి కాలుతుంది. పెద్దవాళ్ళంతా కోట్లుకోట్లు పెట్టి సినిమాలు తీసేస్తే అంత ఆర్థిక స్తోమతు లేనివాళ్ళు ఏమైపోవాలి?'' ఆక్రోశించాడు సుబ్రహ్మణ్యం.

''ఇది మరీ బావుంది. ఎనకటికిమా ఊళ్ళో కామందుగారునాలుగు గూనల్నిండా ఆవకాయ పచ్చడి పెట్టించుకునేవాడు. ఆయనకేం తోట్లోని మామిడి కాయలు, సేని మిరపకాయ, సేలో పండిన నువ్వుల నూనేను. అట్టాగే ఈ పెద్దాళ్ళకేం. ఆళ్ళ స్టూడియోలూ, ఆళ్ళ పిల్లలూ, ఆడితే లాబవే తప్పించి ఆడకపోయినా నట్టవేవుంది?'' అన్నాడు సూర్యం.

''అట్టనమాకు. ఆ లక్ష్మికూడా అన్నీ వున్నేడి వెంటే వుంటది. ఆళ్ళ పిల్లల్నెట్టేసి తీసినా చూపరు ఇట్టు అయిపోయి ఇంకా ఆరు పిచ్చర్లకి సరిపడా లాభాలిచ్చేయి మరి. దానికేవంటావు?'' అన్నాడు సుబ్బయ్య.

''ఏవంటాను? ఎవరి సుడి వాడిది. ఒకర్నిచూసి ఏడిచ్చచ్చి పోతే ఆ అదురుస్టం ఏడిచిన వాడికొస్తుందా?'' నిట్టూర్చాడు సూర్యం.

''నిజమే మీరు చెప్పింది. మీకుగుర్తుందా లేదా ఓ తెలుగు కుర్రాడు కథ చంకనపెట్టుకుని మనం దరి చుట్టూ తిరిగాడు పాపం. కథ చప్పగా వుందని వదిలేశాం. ఆ కథే చవగ్గాకొనుక్కుని తమిళంలో తీశారు. రికార్డులు బద్దలు కొట్టింది. ఆకథే బండెడు డబ్బు పెట్టి కొనుక్కుని తెలుగులో తీస్తున్నారు'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''అవునవును. అడవిలె సింతచెట్టుకింద రాలి పడే సింతపండు సిటీకొచ్చి సూపరుమార్కెట్టులో కూసుంటే వందరూపాయలెట్టి కొనుక్కుతింటం లేదూ ఇదీ అంతే'' వంతపాడాడు సూర్యం.

''కథ మాటలా వుంచితే ఒక్క సినిమా ఇట్టుకాగానే ఈడ రేటు ఎట్టా పెరిగి పోతావుందో సూశారా? ఆ మధ్య ఆ ఎర్రగా బుర్రగా వున్న కుర్రాడి ఇట్టు సినిమీ సూసి ముచ్చటపడి పోయి మా ఊర్రెడ్డిగారు సినిమా తీద్దారని ఆ కుర్రాడి దగ్గరకెళ్ళాడు. ఆ కుర్రాడి రేటు ఇని గుడ్లు తేలేసి బిగుసుకుపోతే అట్నించటే ఆసుపత్రికి తీసుకుపోనారు'' ఒక సంఘునట వివరించాడు సుబ్బయ్య.

''పోన్లెండి. ఆసుపత్రి ఖర్చు పీడా వదిలిపోయింది. మా వూర్రెడ్డిగారు ఆ హీరోనే పెట్టి సినిమా తీసి ఎనభై ప్రింట్లు రిలీజు సేసేసి కొండకెళ్ళి వచ్చేసరికి ఆ డబ్బులన్నీ ఇంట్లో వున్నయ్యి'' తనూ చెప్పాడు సూర్యం.

''అయ్యోపాపం అంతదారునంగా పోయిందా! మరేం చేశాడు?'' అడిగాడు సుబ్రహ్మణ్యం.

''ఏం జెప్తాడు? ఆ డబ్బాలన్నీ అటకల మీదెట్టేసి ఆళ్ళూరెళ్ళి మావిడి చెట్లకి మందుకొట్టుకుంటున్నాడు'' చెప్పాడు సూర్యం.

''ఏటో. నయటు మేయరుగా వుందనుకా చినిమా తియ్యాలంటే.. అట్టాగని వూరుకుండ లేవాయె! పోనీ కరుచులు తిరిగొచ్చేలా పోయినా బావుణ్ను. అదీ గేరంటీ లేకుండా పాయె. ఇట్టైతే ఎట్టాగంట?'' వాపోయాడు సుబ్బయ్య.

''జనం మరీ తెలివిమీరి పోయారు. టీవీలు వచ్చి సినీ పరిశ్రమను దెబ్బతీసింది అని మనం అంటున్నాం. జనమేమో ఆ టీవీ ప్రోగ్రాములను తిట్టిపోస్తున్నారు.

ఏం చేసి వాళ్ళను మెప్పించాలె మహామహులకే అర్థం కావడం లేదు. ఆమధ్య మొదటి రీలు నించి శుభం దాకా నరుక్కోవడం చంపుకోవడంతో సినిమా వస్తే.. ఛండాలం సినిమా అంతా హింస అని తిప్పికొట్టారు.

మరుసటి నెల్లో అసలే హింసా లేకుండా పాటలూ పద్యాలూ పెట్టి హాల్లోనూ వరండాలోనూ కథంతా నడిపి సినిమా వస్తే చప్పగా వుందని చెప్పాడు సుబ్రహ్మణ్యం.

''నిజమేనుట కదా! అప్పుడు నేనూళ్ళో లేను. ఏం జేశారు పాపం వాళ్ళు?'' అడిగాడు సూర్యం.

''ఏంజేత్తారు? ఈ పిచ్చరు మొదలెట్టిన్నాడే ఇట్టనుకున్నాం. కానీ ఇంత ఇట్టవుతుందని కల్లెగూడా

అనుకోలే అని అన్ని టీవీచానళ్ళలోనూ ప్రోగ్రాము లెట్టి చెప్పేరు.

బస్సులేసుకుని ఇజయయాత్రన్సెప్పి అట్టా నాలుగూళ్ళూ తిరిగొచ్చారు'' అన్నాడు సుబ్బయ్య.

''మళ్ళీ అదొక దండగ''

''అట్టనమాకండి. ఆ హడావిడి చూసైనా నలుగురూ సినిమాకొత్తారని ఆన'' అన్నాడు సూర్యం.

''ఏదో సెయ్యాల్సిందంతా సేసేశాం అని ఓ చాటిచుఫొచ్చును'' సుబ్బయ్య ఉవాచ.

''ఆమాటా నిజమే. సినిమా తీద్దామనుకున్న దగ్గర్నించీ చివరాఖరు దాకా పాపం చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తున్నారు. ఎటొచ్చీ అదృష్టమే కలిసి రావడం లేదు'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''సర్లే ఏం జేత్తాం? కట్టాలొచ్చినప్పుడే ధైర్నంగా నిలబడాలి. ఆళ్ళ సంగతీ ఈళ్ళ సంగతీ ఎందుగ్గానీ మన సంగతేటో ఆలోసించాలి. సినిమా తియ్యాల్నా వద్దా?'' పాయింటులోకి వచ్చాడు సూర్యం.

''బాగుందయ్యా. దొంగలెత్తుకు పోతారని డబ్బు పోగెయ్యడం మానేత్తన్ననా? జబ్బులొత్తాయని తిండి మానేత్తనన్నా? ఇదీ అంతే. సినిమా డెపినెటుగా తియ్యాల్సిందే'' ఖచ్చితంగా చెప్పాడు సుబ్బయ్య.

'' ఏం సినిమా తీద్దాం? ఈ మధ్యన పాములూ తేళ్ళూ దయ్యాలూ భూతాలూ వున్న సినిమాలు మొదలయ్యాయి. మనం ప్రయత్నం చెయ్యచ్చు. లేదూ పురాణ గాథలుండనే వున్నాయి'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''అట్టాటియన్నీ వద్దులే. అట్టాటివంటే మరీ గాల్లో దీపం ఎట్టినట్టే. ఎప్పటికైనా లవ్వు టోరీనే సేపు. కుర్రాళ్ళు సూసేత్తారు'' అన్నాడు సుబ్బయ్య.

''అవునవును లవ్‌స్టోరీనే మంచిది. కదలేకపోయినా నాలుగు పాటలెట్టేసి పని గడిపేయచ్చు'' ఏకీభవించాడు సూర్యం.

''అయితే సరే. మనవాళ్ళ అబ్బాయున్నాడుగా. వాడిని హీరోని చెయ్యాలని వాళ్ళ నాన్న పెరపెరలాడిపోతున్నాడు. ఆ కుర్రాడిని హీరోగా తీసుకుంటే ఆయనే ఓ కొమ్ముకాస్తాడు'' సలహా ఇచ్చాడు సుబ్రహ్మణ్యం.

''అట్టనే సేద్దాం. హీరోగా తెలుగు కుర్రాడినే పెట్టినా హీరోయిను మాత్రం హిందీపిల్లే వుండాల మరి. ఆ పిల్లెవరో వుంది కత్తెరెయ్యనాకైపు. ఆవిడని పెడదాం'' అన్నాడు సూర్యం.

''ఛ. వద్దయ్యా. ఆ పిల్ల పేర్లోనే కత్తెరుంది. శుభమా అని పిచ్చరు తీత్తే కత్తెరా కత్తీ ఎందుకు?'' వారించాడు సుబ్బయ్య.

''అబ్బే అది మన తెలుగు కత్తెర కాదు. హిందీ కత్తెర. అదీగాక పేర్లోనే వుంది కైపు. కాబట్టి కత్తెరెయ్యనా కైపే బావుంటుంది''చెప్పాడు సూర్యం.

''ఏ కత్తెర అయినా ఆవిడా చాలా ఫేమస్. మనం అందుకోలేం'' వున్నమాట చెప్పి తగాదా తీర్చేశాడు సుబ్రహ్మణ్యం.

''అందుకోలేని ఈరోయిను వద్దులే. వేరే కొత్త పిల్లని సూత్తే అందరూ కొత్తవాళ్ళలా సినిమా అని పబ్బిలిచిటీ సెయ్యచ్చు'' అన్నాడు సుబ్బయ్య.

''మరి కథ కావాలి కదా. ఏం చేద్దాం. ఎవరైనా పేరున్న వాళ్ళ చేత రాయిద్దామా? లేకపోతే తమిళ మిట్టూ కన్నడం హిట్టూ కొనుక్కుందామా'' అడిగాడు సుబ్రహ్మణ్యం.

''వద్దులే. అదంతా మనం బరించలేం. మనవే కూసుని కథ రాసేసుకుందాం'' అన్నాడు సూర్యం.

''ఓ నాల్రోజులు వరసాగ్గా కూసుంటే కథ అదే వత్తది'' సుబ్బయ్య ఆలోచన.

''నిజమే లేండి. ఎన్నో మంచికథలు ఇలా నలుగురూ కూర్చుని మాట్లాడు కుంటూంటేనే పుట్టుకొచ్చాయి'' ఆశాభావం వ్యక్తపరిచాడు సుబ్రహ్మణ్యం.

''అవున్నిజమే. ముందో లైననుకుంటే నిదానంగా డెవలప్పు సేసుకోవచ్చు. నాకాడ ఓ లైనుంది'' అన్నాడు సుబ్బయ్య.

''మరింకా ఆలస్యం ఎందుకు. శుభస్య శీఘ్రం చెప్పండి'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''ఓ అబ్బాయుంటాడు. ఓ అమ్మాయుంటది. ఆళ్ళిద్దరూ పేమించుకుంటారు. ఆళ్ళ పెద్దాళ్ళకు ఆళ్ళ పేమకు ఒప్పుకోరు. పెస్టుతానికి ఇదీలైను'' చెప్పాడు సుబ్బయ్య.

''బావుంది. ఆ మిగతా కత నెమ్మది నెమ్మదిగా అల్లుకోవచ్చు'' మెచ్చుకున్నాడు సూర్యం.

''ఈ మాత్రం కథుంటే చాలు. అయితే ముందు టైటిలు రిజిస్టర్ చేయించేద్దాం'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''టైటిలు మాత్రం నువ్వే ఆలోసించాల'' అన్నాడుసుబ్బయ్య.

కాసేపు ఆలోచించాడు సుబ్రహ్మణ్యం. ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు మిగిలిన ఇద్దరూ.

'అమ్మాయీ అబ్బాయి లేచిపోయారు' ఇదీ టైటిలు. ఎలా వుంది? అడిగాడు సుబ్రహ్మణ్యం.

''బాగానే వుంది. మంచి ఓ పేరు సాలదుగదా. కింద ఇంకొకటుండాలిగా'' గుర్తు చేశాడు.

ఒక్క క్షణం ఆలోచించి ''అంతా అబద్ధం'' చెప్పాడు.

అంటే మొత్తంగా 'అమ్మాయి అబ్బాయి లేసిపోయారు. అంతా అబద్ధం' అన్నమాట అన్నాడు సూర్యం.

''బానే వుందనుకో. అట్టా డైరెట్టుగా అమ్మాయీ అబ్బాయి లెగిసిపోయారు అనే బదులు ఆళ్ళిద్దరికీ పేర్లెట్టి లెగిసిపోయారు అంటే బావుంటుందేమో సూడండి'' సలహా చెప్పాడు సుబ్బయ్య.

''అవున్నిజమే. ఇప్పుడదేగా ట్రెండు. ఆ పద్ధతిలో ఆలోచించుండి'' అన్నాడు సూర్యం.

మళ్ళీ ఆలోచించాడు సుబ్రహ్మణ్యం. ''సరే అయితే మరీ పాత పేర్లయితే ఉదాహరణకి సీతారాముడు లేచిపోయారు అంటే అందరూ గోలెడతారు. మరీ మోడర్న్‌గా టింకూ స్వీటీ లేచిపోయారు అన్నా బావుండదు. కాబట్టి మధ్యస్థంగా సుందర్రావు సువర్చల లేచిపోయారు అంటే బావుంటుంది'' అన్నాడు.

''శానా బావుందండీ. మరి 'అంతా అబద్ధం' అట్టానే వుండదిగా'' అన్నాడు సుబ్బయ్య.

''అది అలానే వుంటుంది'' చెప్పాడు సుబ్రహ్మణ్యం.

''అంటే 'సుందర్రావు సువర్చలా లేచిపోయారు! అంతా అబద్ధం' అదన్నమాట టైటిలు. మరి రిజిస్టరు సేసేద్దామా?''సూర్యం అడిగాడు.

''ఎంబట్నే సేసెయ్యాల. లేకపోతే ఏరేవాళ్ళు సేసేత్తారు. గోడలకి సెవులుంటాయి'' కంగారుపెట్టాడు సుబ్బయ్య.

సుబ్రహ్మణ్యం వెంటనే లేచి ఆ పనిమీద వెళ్ళాడు.

''ఏదో సినిమా తియ్యాలి. అది నలుగురూ సూసి మెచ్చాలి,. అని మొదలెడతన్నాం. ఏటవుతుందో ఏటో'' అన్నాడు దిగులుగా సూర్యం.

''అవునవునూ. మనం సెయ్యాల్సిందంతా సేత్తాం. జనం సూత్తారా లేదా అన్నదే మిలియం డాలరు కొచ్చిను?'' అన్నాడు సుబ్బయ్య కూడా దిగులుగా.

★

